## క్లుప్తంగా

### అనాథలను ఆదుకోవడంలోనే సంతృప్తి



బియ్యం పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రెసిడెంట్ శ్రీధర్ ఆచార్య

**పాతపట్నం:** అనాథులను ఆదుకోవడంలోనే సంతృప్తి ఉంటుందని తిరుపతికి చెందిన నవ జీవన్ ట్రస్ట్ ప్రెసిడెంట్ కె.శ్రీధర్ ఆచార్య అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న నవ జీవన్ ట్రస్ట్ ఆవరణలో అన్నలక్ష్మి ఫ్రీ రేషన్ ద్వారా 40 మంది పేద వితంతువులకు బియ్యం పంపిణీ చేశారు. నరసింహారెడ్డి, బాబూరావు, కృష్ణవేణి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

### భక్తులకు ఇబ్బంది కలగకూడదు



అధికారులకు సూచనలిస్తున్న డీపీఓ భారతీసౌజన్య

**జలుమూరు:** ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు శ్రీముఖలింగంలో నిర్వహించనున్న శివ రాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య అన్నారు. శుక్రవారం శ్రీముఖలింగంలో పంచాయతీ అధికారులతో మాట్లాడారు. భక్తులకు తాగునీరు అందించాలన్నారు. వీధుల్లో చెత్త, వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. మూడు రోజుల పాటు ధూళి రేగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని వీధుల్లోనూ బ్లీచింగ్ వేసి శుభ్రపరచాలన్నారు. స్వామివారి చక్రతీర్థ సాన్నాల సమయంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని, నది వరకు రోడ్డును బాగు చేయాలన్నారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. పంచాయతీ విస్తరణ అధికారి చల్ల ఉమామహేశ్వరరావు, మండల జేఈ శ్రీధర్, సర్పంచ్ టి.సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### కొలతల్లో తేడాలుంటే కఠిన చర్యలు



కంప్యూటర్ కాటాలకు సీళ్లు వేస్తున్న అధికారులు

**పాతపట్నం:** వ్యాపారులు వస్తువులు విక్రయించేటప్పుడు కొలతల్లో తేడా వస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతలు జిల్లా ఇన్‌స్పెక్టర్ టి.శ్రీధర్ హెచ్చరించారు. పాతపట్నంలోని బలాజీనగర్ ఎదురుగా ఉన్న ఓ రైస్‌మిల్లు వద్ద నగరంలోని వ్యాపారులు వాడుతున్న కాటాలకు శుక్రవారం సీళ్లు వేశారు. ముందుగా నగరంలోని పలు షాపుల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఏ వ్యాపారస్తుడైనా కొలతల్లో తేడాలు చేస్తే మొదటిసారి హెచ్చరిస్తామని, మరోసారి పట్టుబడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంతో మేలు



అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మి

**పాతపట్నం:** ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి సి.హెచ్.లక్ష్మి అన్నారు. మండలంలోని చంగుడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కత్తెర, ఖాండం తొలిచే పురుగుల నివారణకు అగ్నిఅస్త్రం ఉపయోగపడుతుందన్నారు. అగ్ని అస్త్రం తయారుచేసే విధానాన్ని వివరించారు. దువ్వారి ఫల్గుణరావు, ఐసీఆర్పీలు నీరంజన్, సాయి, రైతులు పాల్గొన్నారు.

### నవధాన్యాల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రీజనల్ ప్రకృతి వ్యవసాయాధికారి హేమసుందర్

**సారవకోట:** నవ ధాన్యాలు సాగుతో భూమిలో తేమ శాతం పెరుగుతుందని, రైతులకు నవ ధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలని ప్రాంతీయ ప్రకృతి వ్యవసాయాధికారి హేమసుందర్ సూచించారు. మండల మహిళా సమఖ్య సమావేశ మందిరంలో మండలంలోని సేంద్రియ వ్యవసాయ సిబ్బందికి నవ ధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. తొలకరి వర్షాలు ప్రారంభానికి ముందు పచ్చిరొట్ట, పప్పు, నూనె, చిరు ధాన్యాలు, సువాసనిచ్చే జాతుల విత్తనాలు వరి పొలాల్లో వేసుకోవాలన్నారు. వర్షాలు కురిసిన తరువాత వాటిని కోయాలన్నారు. అలా చేయడం వలన పొలాల్లో తేమ శాతం పెరగడంతో పాటు భూమి సారవంతం అవుతుందన్నారు. ఎస్ఆర్పీ, మాస్టర్ ట్రైనీ ఉన్నారు.

# దోస పంటకు కేరాఫ్ రొట్టవలస

- ఫిబ్రవరి నుంచి విక్రయాలు ప్రారంభం
- వేసవిలో గిరాకీ



అమ్మకానికి సిద్ధం చేసిన దోసకాయలు



దోస పాదులు

**సరుబుజ్జిలి:** వేసవి కాలం వచ్చిందంటే దోస కాయకు గిరాకీ ఉంటుంది. దోస తరచూ తీసుకోవడం వలన జీర్ణసంబంధ వ్యాధులను అరికట్టవచ్చు. శరీరంలో ఉన్న ఉష్ణతాపాన్ని తగ్గించవచ్చు. దీనివలన ప్రతి ఒక్కరూ వేసవిలో దోస కోసం ఎగబడి కొనుగోలు చేస్తుంటారు. తాజా, రుచికరమైన దోసకాయలు కావాలంటే మండలంలోని రొట్టవలస గ్రామాన్ని సంప్రదించాల్సిందే. గ్రామంలో సుమారు 60 కుటుంబాలు దోససాగు చేస్తున్నారు. ప్రతిఏటా డిసెంబర్‌లో పాదులు నాటి, పక్వానికి వచ్చిన తరువాత ఫిబ్రవరి నుంచి విక్రయాలు చేస్తారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని ఎన్‌టీవాడ, కొరగాం, కొత్తవలస, బొడ్డేపల్లి, సింగూరు, పాతపాడు, అగ్రహారం, అవతరాబాద్, కొత్తకోట, మతలబుపేట, పెదమాలపేట, ఇస్కలపాలెం తదితర గ్రామాల్లో వివిధ రకాల వాణిజ్య పంటలు సాగు చేస్తుంటారు. రొట్టవలసలో మాత్రం కేవలం దోస పంటను మాత్రమే రైతులు పండిస్తారు. ఇదీ ఈ గ్రామానికి ఉన్న ప్రత్యేకత.

**రొట్టవలసలో ఆగాల్సిందే..**

అలికాం-బత్తి రోడ్డులో ప్రయాణించే ప్రతీ వాహనం రొట్టవలస గ్రామం వచ్చేసరికి బ్రేకులు పడాల్సిందే. కార్లు, ఇతర వాహనాల్లో వచ్చి ఉద్యోగులు, వ్యాపారులు దోసకాయలు కొనుగోలు చేస్తుంటారు. ఏడాదిలో ఒక్కసారైనా రొట్టవలస దోస రుచిచూడాల్సిందేనని తెగ ఆరాటపడుతుంటారు. ఎటువంటి క్రిమిసంహారక మందులు లేకుండా స్థానికంగా లభించిన సేంద్రియ ఎరువులతో సాగుచేయడం వలన అధికశాతం మంది దోసకాయలు తినడానికి ఇష్టపడుతున్నారు. కొంతమంది విశాఖ, విజయనగరం వంటి ప్రాంతాల నుంచి చుట్టం చూపుగా వచ్చేవారు ఇక్కడి దోసకాయలు కొనుగోలు చేస్తారు.

**కిలోల లెక్కన అమ్మకాలు..**

దోస పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు అధికంగా రాకపోవడం వలన సుదూరం ప్రాంతాలకు వెళ్తే ఖర్చులు దండగని భావించిన రైతులు స్థానికంగానే విక్రయాలు చేపడతారు. రొట్టవలస రహదారి పక్కన తాత్కాలికంగా టెంట్లు వేసి కిలో దోసకాయలు రూ.60 నుంచి రూ.80 వరకు విక్రయాలు చేపడుతుంటారు.

### సీజన్‌లోనే విక్రయిస్తాం



వేసవి సీజన్‌లో దోస పంట సాగు జరుగుతుంది. మా ప్రాంతంలో పండించిన దోస పంటకు గిరాకీ అధికంగా ఉంటుంది. సహజ వనరుల పద్ధతిలో సాగు చేయడం వలన వీటి రుచి వేరుగా ఉంటుంది. రహదారిలో వెళ్లే ప్రతి ఒక్కరూ కొనుగోలు చేస్తారు. దోస కాయలకు మా గ్రామం పెట్టిందిపేరు.

– **ఆర్.అప్పలనాయుడు**, రైతు, రొట్టవలస, సరుబుజ్జిలి మండలం

### గిట్టుబాటు ధరలు కల్పించాలి



నెలల తరబడి కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనివలన ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేసేందుకు అవకాశంలేక స్థానికంగానే ఉన్న ధరల మేరకు పంటను విక్రయాలు చేస్తున్నారు. ప్రభుత్వం ముందుకు వచ్చి దోస పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– **మూడడ్ల భద్రమ్మ**, సర్పంచ్, రొట్టవలస, సరుబుజ్జిలి మండలం

## ఘనంగా మాజీ స్పీకర్ మనవరాలు పుట్టినరోజు



చిన్నారి చారుశీలను ఆశీర్వదిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, నాయకులు

- కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసిన చిన్నారి చారుశీల

**ఆమదాలవలస:** మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం తనయుడు చిరంజీవి నాగ్, మాధురిల కుమార్తె చారుశీల మొదటి పుట్టినరోజు వేడుక శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పూజారిపేటలో గల తమ్మినేని స్వగృహం వద్ద జిల్లా, నియోజకవర్గ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యుల మధ్య చిన్నారి చారుశీల కేక్ కట్ చేసింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ఇంతమంది అభిమానుల మధ్య నా మనుమరాలి పుట్టినరోజు వేడుక నిర్వహించడం చాలా ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ అభిమానాన్ని ప్రజలంతా తమ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాలకొండ మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ యువ నాయకుడు ధర్మాన మనోహర్‌నాయుడు, రాష్ట్ర కళింగ విభాగం అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చిన్నారిని ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు, చింతాడ రవికుమార్, ఎమ్మెల్సీ వరదు కల్యాణి, తదితరులు

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**నరసన్నపేట:** మండలంలోని ఉర్లాం ఎస్సీ కాలనీలో గల వేంకటేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉర్లాంతోపాటు పరసర గ్రామాలకు చెందిన భక్తులు హాజరై పూజలు చేశారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, ముద్దాడ భైరాగినాయుడు, రాజాపు అప్పన్న, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి తదితరులు ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



నరసన్నపేట: ఉర్లాంలోని వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న కృష్ణచైతన్య, నాయకులు

**వైభవంగా..**

**బూర్జ:** మండల కేంద్రంలోని అభయాంజనేయ ఆలయ 12వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఎం.కేశవశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక, కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఏగు అనురాధ, ఎంపీటీసీ సభ్యుడు చొక్కర పోలినాయుడు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### వీఆర్వోల పనితీరుపై అసహనం



మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణమూర్తి

**సారవకోట:** రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకు వీఆర్వోలు చర్యలు తీసుకోవాలని టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. టెక్కలి డివిజన్ పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 8,156 భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయని, దీంట్లో 2,651 పరిష్కరించారన్నారు. రీ సర్వే గ్రామ సభల్లో 3,510 దరఖాస్తులు స్వీకరించారని, దీంట్లో 1,707 సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. తహసీల్దార్ల స్థాయిలోని సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. వారి స్థాయిలో లేని సమస్యలు తన దృష్టికి తీసుకురావాలన్నారు. పలువురు వీఆర్వోలు సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించడంతో వారి పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటానన్నారు. తహసీల్దార్ విజయలక్ష్మి, డీటీ రవి ఉన్నారు.

## బాలలను పనిలో పెడితే కఠిన చర్యలు

**జలుమూరు:** హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు, ఆటో మొబైల్ షెడ్లలో 18 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారితో పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లేబర్ అధికారి విభూది జయశంకర్ అన్నారు. శుక్రవారం చల్లవానిపేటలో పలు దుకాణాలు, వ్యాపార సంస్థలను తనిఖీ చేశారు. అనంతరం ఈ - శ్రామ్ పథకంపై అవగాహన కల్పించారు. ఎస్ఎస్ఏ కో ఆర్డినేటర్ జనార్దనరావు, సోషల్ వెల్ఫేర్ సిబ్బంది మాధవి, తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



సర్వేలో పాల్గొన్న వైద్య సిబ్బంది

**సరుబుజ్జిలి:** దివ్యాంగుల సంక్షేమం కోసం బాధ్యతగా వ్యవహరించాలని ఆమదాలవలస ప్యానల్ అడ్వకేట్ వాడవలస రాజేశ్వరరావు తెలిపారు. మండలంలోని తెలికిపెంట, అగ్రహారం, పర్వతాలపేట గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాసాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం దివ్యాంగ నిర్ధారణ సర్వే కార్యక్రమం నిర్వహించారు. 100 ఇళ్లల్లో సర్వే చేశారు. ఎల్‌పీఎం అగ్రహారం గ్రామానికి చెందిన నివగాన రాజును దివ్యాంగ బాలునిగా గుర్తించారు. బాలునికి ప్రభుత్వం నుంచి అన్ని సహాయ, సహకారాలు అందేలా చూస్తామన్నారు. ఈ సర్వేలో సరుబుజ్జిలి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సాహితి ప్రియదర్శిని, సీహెచ్‌ఓ డి.మోహన్‌రావు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం

**బూర్జ:** మండలంలోని తోటవాడ జెడ్పీ హైస్కూల్‌లో 2007లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు తమతో చదువుకున్న సూర సరస్వతికి రూ.8 వేల ఆర్థిక సహాయం చేశారు. శుక్రవారం నిర్వహించిన గెట్ టు గెదర్‌లో సరస్వతి ఆర్థిక పరిస్థితి బాగులేదని తెలుసుకుని ఆర్థికసాయం అందించారు. సరస్వతికి ఇద్దరు ఆడపిల్లలున్నారు.

### 445 దరఖాస్తుల పరిష్కారం

**నరసన్నపేట:** మండలంలో రెవెన్యూ సదస్సులు, రీ సర్వే చేసిన గ్రామాల్లో నిర్వహించిన సభల్లో వచ్చిన దరఖాస్తుల్లో 445 పరిష్కరించామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఉర్లాంలో దరఖాస్తులు అధికంగా పెండింగ్ ఉండటంతో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి వీఆర్వోతో తహసీల్దార్ సమీక్ష చేశారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని నిర్వహించిన రెండు సదస్సుల్లో 1352 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 445 పరిష్కారం చేసినట్లు వివరించారు. వచ్చిన దరఖాస్తులు 105 రోజుల్లో పరిష్కరించాల్సి ఉందని, ఈ మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు గ్రామాల్లో వీఆర్వోలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉర్లాంలో 96 దరఖాస్తులు రాగా 28 పరిష్కరించామన్నారు. ఆర్ఐ సాయి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### పోస్టల్ ఉద్యోగుల నిరసన



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

**ఆమదాలవలస:** పోస్టల్ శాఖలో పనిచేస్తున్న జి.డి.ఎస్ ఉద్యోగులను 8వ వేతన సంఘంలో కలపాలని పోస్టాఫీస్ ఉద్యోగులు, ఆర్ఎంఎస్ ఉద్యోగుల సంఘం నాయకుడు ఎ.సీతారామ్మూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీజేసీఏ పిలుపుమేరకు శుక్రవారం ఆమదాలవలస పట్టణంలోని ప్రధాన తాపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీతారామ్మూర్తి మాట్లాడుతూ పోస్టల్ యాక్ట్ 2023ను విరమించుకోవాలని కోరారు. అందరికీ ఓపీఎస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తపాలాశాఖ, ఆర్ఎంఎస్ ఉద్యోగులు బి.ఎస్.ఆర్.ఎం.నాయుడు, జి.శ్రీనివాసరావు, సి.హెచ్.అచ్చుతరావు, తదితరులు పాల్గొన్నారు.

### మాడిన మామిడి పూత



ఈ చిత్రం మెళియాపుట్టి మండలంలోని సవర మల్రిపాడు సమీపంలో పొగమంచు కురవడంతో మాడిపోయిన మామిడి పూత. గతకొద్ది రోజులుగా మండల వ్యాప్తంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. ఫిబ్రవరిలో పిందె తయారవడం ప్రారంభం కావడంతో ఈ సమాయంలోనే జాగ్రత్తలు అవసరమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పూతరావడానికి ముందే తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి రైతులకు తెలిజేస్తున్నామని ఏఓ ధానకర్మడు తెలిపారు. పిందె రాల్చకుండా యాజమాన్య పద్ధతుల గూర్చి గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారన్నారు.

– మెళియాపుట్టి

### ఆశాజనకంగా చోడి సాగు



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని ముంగెన్నపాడు ప్రాంతంలో చోడి పంట. చిరుధాన్యాల సాగులో భాగంగా రైతుల చోడి(రాగి) పంటను సాగు చేస్తున్నారు. మండలంలోని బరటాం, ముంగెన్నపాడు, కోవిలాం, ధనుకువాడ, దబ్బపాడు, సిద్ధాంతం, బరటాం, బొర్రంపేట తదితర గ్రామాల్లో చోడి పంట ఆశాజనకంగా ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని ఇచ్చే చోడి పంట సాగు రైతులకు ఆర్థికంగా ఆదుకుంటుంది. రాగుల వాడకం గతం కంటే పెరగటంతో పంట సాగుపట్ల రైతులు దృష్టి సారించారు.

– ఎల్.ఎన్.పేట

### దట్టంగా పొగ మంచు



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని సిద్ధాంతం రోడ్డులో గురువారం ఉదయం 9 గంటల సమయంలో దట్టంగా కురుస్తున్న పొగ మంచు. మండలంలో గత కొన్ని రోజులుగా పొగమంచు కురుస్తోంది. పగటి ఉష్ణోగ్రత వేడిగా ఉన్నప్పటికీ రాత్రి ఉష్ణోగ్రతలు చలిగానే ఉంటున్నాయి. పొగమంచు దట్టంగా కురవటంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పొగ మంచు కారణంగా జీడి, మామిడిపూతతో పాటు ఇతర పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

### భౌ పెడుతున్నాయ్..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని పాలవలస వద్ద సంచరిస్తున్న కుక్కల గుంపు. మండలంలోని కొత్తకోట, పెద్దపాలెం, చిన్నపాలెం, పాలవలస, రావివలస, కొండవలస, దకరవలస గ్రామాల్లో కుక్కలు సంచారం అధికం కావడం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం అయ్యేసరికి వీధుల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరగడం వలన వృద్ధులు, మహిళలు, చిన్నారులు బయటకు అడుగుపెట్టాలంటే భయపడుతున్నారు. ఈ మధ్య కాలంలో అలమాజీపేట, పెదమాలపేట గ్రామాల్లో పలువురు చిన్నారులు కుక్క కాటుకు గురయ్యారు. విజయరాంపురం, పాలవలస గ్రామాల్లో పశువులు కూడా కుక్కల బారినపడ్డాయి.

– సరుబుజ్జిలి

## రైతుకు ప్రభుత్వ సేవలు దూరం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**ఎల్.ఎన్.పేట:** వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న గ్రామీణ ప్రాంత రైతులకు చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ సేవలు దూరం చేశారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రైతులకు ఎరువులు, విత్తనాలు సక్రమంగా పంపిణీ చేయలేదన్నారు. కల్తీ ఎరువుల విక్రయం పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. ఎన్నికల ముందు అనేక మాయమాటలు చెప్పారని, అధికారం చేపట్టిన తరువాత రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రతీ రైతులకు పంట పెట్టుబడి కోసం ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు అందించలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత ఒక ఖరీఫ్ సీజన్ ముగిసిందని, రబీ సీజన్ కూడా సగం కాలం అవుతుందన్నారు. రైతులకు పంట పెట్టుబడి ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. పంటల బీమా ప్రీమియం చెల్లించలేదన్నారు. ఎన్నికల ముందు సమగ్ర భూ రీసర్వే చేసుకున్న రైతులకు ప్రభుత్వ పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ నిలిపివేసిందన్నారు. పాస్‌పుస్తకాలు రాక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రైతులకు ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు అందివ్వాలనే ఆశయంతో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాల పేర్లను రైతు సేవా కేంద్రాలుగా మార్చారన్నారు. వీటికి పేర్లు మార్చినా సేవలు అందటం లేదన్నారు. రైతు సంక్షేమానికి జగనన్న ప్రాధాన్యం ఇచ్చారన్నారు.

### బోరు బాగుచేయరూ..



మరమ్మతులకు గురైన బోరు

**బూర్జ:** మండలంలోని అన్నంపేట గ్రామంలో గల ఎస్సీ వీధిలో చేతి పంపు (బోరు) పనిచేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులు కావస్తున్నా మరమ్మతులు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని తక్షణమే రిపేరు చేయాలని కోరుతున్నారు.

### ఏడుగురిపై బైండోవర్

**నరసన్నపేట:** స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఏడుగురు వ్యక్తులకు తహసీల్దార్ సత్యనారాయణ వద్ద బైండోవర్ చేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ రమణమూర్తి తెలిపారు. పోలాకి మండలం కొత్తరేవుకు చెందిన కొమర అప్పలనాయుడు వద్ద అక్రమంగా ఉన్న ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. పాత నేరస్తులు ఆరుగురిని శుక్రవారం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.